# అభివృద్ధి పథంలో నిడమానూరు

- రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు
- అందంగా ముస్తాబైన రోడ్లు, డ్రెయిన్లు
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా ఉన్న ఈ గ్రామం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎళ్ల తరపడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బీకే సెంటర్ల నిర్మాణంతో పాటు రహదారులు, డ్రెయిన్లకు మోక్షం లభించింది. గ్రామంలో మట్టి రోడ్డు కనిపించనంతగా రూపు రేఖలు మారిపోయాయి.

**రూ. 1.58 కోట్లతో పక్కా భవనాలు**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, వెలెనెస్ సెంటర్లు ఉండాలన్న సంకల్పాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అతి తక్కువ సమయంలోనే నిడమానూరులో పక్కాగా భవనాలను కొన్నింటిని పూర్తి చేశారు. మరికొన్ని నిర్మాణాలు జరుగుతున్నాయి. గ్రామంలో మూడు సచివాలయాలు ఉండగా ఒకటి ప్రధాన పంచాయతీ కార్యాలయంతో పాటు మరో రెండింటిని నిర్మిస్తున్నారు. ఈ సచివాలయాల నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరయ్యాయి. నెహ్రూనగర్‌లోని సచివాలయం-2 సుందరంగా పూర్తి చేసి ప్రారంభించారు. మిగిలున్న సచివాలయ నిర్మాణం ప్రారంభించారు. అలాగే రూ. 38 లక్షలతో వెల్‌నెస్ సెంటర్లు, రూ. 40 లక్షలతో ఆర్బీకే సెంటర్ల నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి.



నిడమానూరులో సుందరంగా తీర్చిదిద్దిన సచివాలయం-2

**నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపు రేఖలు**

గ్రామంలోని జెడ్పీ పాఠశాల, ఉర్దూ పాఠశాలతో పాటు మరో మూడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు రూ. 3.45 కోట్లుతో నాడు-నేడు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జెడ్పీ పాఠశాలకు తొలుత కోటి రూపాయలు మంజూరవ్వగా రెండో విడత మంజూరైన రూ. 1.30 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేశారు. గ్రామ శివారు దోనె ఆత్కూరులో రూ. 60 లక్షలతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు.

**రూ. 3 కోట్లతో తాగునీటి సమస్యలకు చెక్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ. 3 కోట్లతో గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు, మోటారు బోర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామం మొత్తం వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే కొత్తగా 2 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అతి త్వరలో దీని నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభించనున్నారు.

**సీసీ రోడ్ల అభివృద్ధి**


గ్రామంలో మట్టి రోడ్లు కనిపించనంతగా సీసీ రోడ్లు వెలిశాయి. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతం, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేశారు. ఇలా రహదారులన్ని కలుపుకొని సుమారు రూ. 1.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అంతేకాకుండా దాతల సహకారంతో గ్రామంలోని రైస్‌మిల్లు రోడ్డు అభివృద్ధికి రూ. 10 లక్షల విరాళం, పంచాయతీ నిధులు మరో రూ. 21 లక్షలతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండల పరిషత్ నిధులు రూ. 25 లక్షలు, పంచాయతీ నిధులు మరో రూ. 5 లక్షలతో గ్రామంలోని శ్మశానవాటికకు కాంపౌండ్ వాల్, మెరక పనులు దిగ్విజయంగా పూర్తి చేశారు.

**వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి..**



గ్రామ సర్పంచ్‌గా గ్రామంలో ఏఏ అభివృద్ధి పనులు చేయాలనుకున్నానో ఆ పనులన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తి చేశాను. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక చొరవతో గ్రామాన్ని అభివృద్ధి చేయడం జరిగింది. ముఖ్యంగా గ్రామంలోని ప్రతీ వీధిలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేశాం.

–శీలం రంగారావు, నిడమానూరు సర్పంచ్



నెహ్రూనగర్‌లో ఆర్చి ఏర్పాటు



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్న జెడ్పీ పాఠశాల



గ్రామంలో సీసీ రోడ్డు

## క్లుప్తంగా

### రూ. 32 లక్షలతో చిన్నకట్ట రహదారి పనులు



పెనమలూరు: యనమలకుదురు లాకుల వద్ద నుంచి పెదపులిపాక గ్రామానికి వెళ్లే చిన్నకట్ట రోడ్డు నిర్మాణానికి స్థానికులు ఆదివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నకట్ట రోడ్డు వేయాలని మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి మున్సిపాలిటీ నిధులు రూ. 32 లక్షలు మంజూరు చేయించారన్నారు. మంత్రి తీసుకున్న చొరవతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. తమ సమస్యలు విని వెంటనే స్పందించిన మంత్రికి స్థానికులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యారా నాంచారయ్య, పేటేటి రమేష్, రమణారెడ్డి, యారా ప్రసాద్, గోళ్ల వెంకటేశ్వరరావు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న సపోటా తోటలో సోమవారం సాయంత్రం మూడు గంటలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ తెలిపారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద మండలంలోని 1,604 డ్వాక్రా సంఘాలకు చెందిన 15,974 మంది లబ్ధిదారులకు రూ. 15.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా గ్రూపుల సభ్యులందరూ హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

### సజావుగా గ్రూప్-2 పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ కాలేజీలో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో 480 మంది అభ్యర్థులకు గానూ 357 మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 576 మందికి గానూ 425 మంది పరీక్షకు హాజరయ్యారు.

పెనమలూరు: పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల పరిధిలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 2400 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1795 మంది పరీక్షకు హాజరవ్వగా, 605 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను డీపీఓ నాగేశ్వరనాయక్ పర్యవేక్షించారు. ఎంపీడీఓ కుమార్ బాబు, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ పరీక్ష నిర్వహణలో పాల్గొన్నారు.

### పెదపులిపాకలో ఘనంగా అమ్మవారి రథోత్సవం



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం ఆరు గంటలకు శ్రీసుందరేశ్వర స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు 108 మంది దంపతులచే చండీహోమం నిర్వహించారు. భక్తులు కుంకుమార్చన, సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో చేశారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ అనుగ్రహభాషణ చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

### యనమలకుదురులో మంత్రి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి జోగి రమేష్ పరిశీలించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కొండపై రోడ్డు, కాటేజీల నిర్మాణం, గిరి ప్రదక్షణకు రోడ్డు నిర్మాణం వంటి అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: వ్యక్తి అదృశ్యం అవడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ కుకట్‌పల్లికి చెందిన నడకుదటి సాయిలక్ష్మి, యశ్వంత్‌వర్మ భార్యభర్తలు. వీరికి ఒక బాబు. యశ్వంత్‌వర్మ హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీలో పని చేస్తాడు. కాగా గత ఏడాది క్రితం యశ్వంత్‌వర్మ బంధువుల బంగారం తీసుకుని బ్యాంకులో తాకట్టు పెట్టి అతని పేరున రుణం తీసుకుని బంధువులకే ఆ సొమ్ము ఇచ్చాడు. అయితే రుణం తీసుకున్న సమయంలో అదనంగా లక్ష రూపాయలు తీసుకున్నాడు. ఈ విషయం ఎవ్వరికి చెప్పలేదు. కాగా రుణం తీసుకున్న బంధువులు సొమ్ము బ్యాంకులో కడదామని చెప్పడంతో సాయిలక్ష్మి, యశ్వంత్‌వర్మ ఈ నెల 21వ తేదీన యనమలకుదురు వచ్చారు. ఈ నెల 23వ తేదీన బ్యాంకులో సొమ్ము కట్టడానికి విజయవాడ బయలుదేరగా మార్గం మధ్యలో యశ్వంత్‌వర్మ అదృశ్యమయ్యాడు. దీంతో భార్య సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిత్యం ప్రజల్లోనే ఉంటా

మంత్రి జోగి రమేష్



యనమలకుదురులో పర్యటిస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం ప్రజల్లోనే ఉండి పని చేస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. యనమలకుదురు గ్రామం సుగాలీకాలనీ, అంబేడ్కర్ నగర్, డబ్బాపంపు సెంటర్ ప్రాంతాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఎటువంటి అవినీతి జరగకుండా సచివాలయాల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి నేరుగా వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేశామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. తోడు దొంగలు వస్తే పేదల పొట్టకొడతారని అన్నారు.

**యనమలకుదురు అభివృద్ధికి కృషి**

యనమలకుదురు గ్రామాభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానని మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. పలు కారణాలతో పథకాలు రాని వారికి వచ్చే మన ప్రభుత్వంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాను జగనన్న ఆశయాల మేరకు పని చేస్తానని, ఎవరు పిలిచినా పలుకుతానని తెలిపారు. అనంతరం మంత్రి రమేష్ లంబాడీ మహిళలతో కలిసి నృత్యం చేశారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, కానూరు మాజీ సర్పంచి దేవభక్తుని సుబ్బారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నేనావత్ చిన్ని, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, స్థానిక నేతలు వెలగపూడి వరప్రసాద్, దేవభక్తుని చక్రవర్తి, మరీదు శ్రీనివాసరావు, యార్లగడ్డ వీరబాబు, కర్రా ఆదిశేషారావు, కోసూరి నరేష్, అష్రఫ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అండగా జగనన్న ప్రభుత్వం

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమే ప్రజలకు అండగా ఉంటుందని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు మురళీ నగర్‌లో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు ఎటువంటి అవినీతి లేకుండా నేరుగా అమలు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా జగనన్న పాలన పారదర్శకంగా ఉంటుందన్నారు. ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు వేమూరి బాలకృష్ణ, కాకర్ల సుబ్బరాజు, అప్పు తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

### బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

కంకిపాడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కంకిపాడు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్సై డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో మాదు రవి నివాసం వద్ద తనిఖీలు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయాలకు పాల్పడుతున్న రవిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

### సామాజిక సేవల్లో విద్యార్థులు పాల్గొనాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థి దశ నుంచి స్వచ్ఛందంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెంపొందుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. డాక్టర్ సుధా నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్యశాల(చిన్నవుటపల్లి) ఆధ్వర్యాన బాపులపాడు మండలం వేలేరులో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని అంతర్గత రహదారుల వెంబడి చెత్త, చెదారాలను దంత వైద్య విద్యార్థులు శుభ్రం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా జూనియర్ డాక్టర్లు అంతా ఏకమై వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచి సుదిమెళ్ల సుందరమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ తేజస్విని పాల్గొన్నారు.

### రైతులను బీజేపీ దగా చేస్తోంది

గన్నవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా మోసం చేస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు, సూరగాని సాంబశివరావు విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్రం అణచివేస్తుండటం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో గన్నవరంలో క్విట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీని రైతులు, కౌలుదారులు జయప్రదం చేయాలని కోరారు.

### మానవత సంస్థకు దాతల విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి రథం ఏర్పాటుకు హనుమాన్‌జంక్షన్‌కు చెందిన తోట వెంకటేశ్వరరావు సోదరులు ఆదివారం రూ. 2.40 లక్షల విరాళం అందించారు. అంతిమ యాత్ర నిర్వహించేందుకు శాంతిరథం వాహనాన్ని మానవత సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నారు. అంతేకాక పశుసంవర్ధక శాఖ విశ్రాంత ఉద్యోగులు రూ. 35,116 వేల విరాళాన్ని మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు అందజేశారు. రిటైర్డ్ ఏడీ డాక్టర్ మొలగాల శివరామ్(హైదరాబాద్) రూ. 10 వేలు, రిటైర్డ్ డీడీ మోటూరు రామకోటేశ్వరరావు(రాజమహేంద్రవరం) రూ. 10 వేలు, పగడాల వెంకట రామకృష్ణ(ఉయ్యూరు) రూ. 5 వేలు, రిటైర్డ్ జేడీ డాక్టర్ ఎన్ఎస్ సోమయాజులు(రాజమహేంద్రవరం) రూ. 5 వేలు, జెట్టి సుబ్బారావు రూ. 5116 విరాళాన్ని మానవతకు అందజేశారు. మానవత నిర్వహిస్తున్న నిస్వార్థ సేవలకు దాతలు అందిస్తున్న విరాళాలకు రాష్ట్ర కన్వీనర్ కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

### ఎయిడ్స్ నివారణపై కళాజాత అవగాహన

ఉంగుటూరు: ఎయిడ్స్ వ్యాధిపట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కళాజాత బృంద ప్రతినిధి ఎం.శేఖర్‌బాబు అన్నారు. పొట్టిపాడులో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందం బుర్రకథ రూపంలో వివరించారు. ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుందో వివరించి, పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే సీడీఫోర్ కౌంట్‌తో సంబంధం లేకుండా ఏఆర్టీ మందులు వాడాలని పేర్కొన్నారు. అలాగే టీబీ, క్షయ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీధి నాటకం ద్వారా ప్రజలకు అర్థమయ్యేరీతిలో హాస్యపు సన్నివేశాలతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కళాజాత బృంద సభ్యులు వీరయ్య, రవితేజ, చిరంజీవి, ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

# ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేసరపల్లిలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



ముస్తాబాద హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కేసరపల్లిలోని జాస్తి చంద్రమౌళి సదన్‌లో ఉత్సాహంగా జరిగింది. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై తిరిగి కలుసుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘ నేతలు మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి దేశ, విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరూ హాజరుకావడం సంతోషకరమన్నారు. దీని కోసం ప్రతి యేటా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు.

**ముస్తాబాద హైస్కూల్‌లో..**

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 70 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమతో పాటు చదువుకుని మృతి చెందిన సహచరులకు నివాళులర్పించారు. గురువులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

### మహానేత ఆశయాలకు కృషి చేయాలి

పెనమలూరు: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు నెరవేరే విధంగా అందరూ కృషి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వణుకూరు గ్రామంలో ఆదివారం రాత్రి మహానేత విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి ప్రసంగించారు. మహానేత పాలనలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహానేత ఆశయాల మేరకు పాలన సాగిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపిస్తే మహానేత ఆశయాలు సాధించగలుగుతామని పేర్కొన్నారు. అలాగే పార్టీ కార్యాలయం ప్రారంభించి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, సర్పంచి చక్క విజయ, నేతలు వణుకూరు కోటేశ్వరరావు, శ్యామ్ సుందర్, వణుకూరు నాగరాజు, చక్క గోపీ తదితరులు పాల్గొన్నారు.



వణుకరులో మహానేత విగ్రహం

### వీరమ్మతల్లి తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లకు భక్తజనం పోటెత్తారు. ఆదివారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తజనం వేలాదిగా తరలిరావడంతో ఉయ్యూరు పట్టణం వీరమ్మతల్లి నామస్మరణతో మారుమ్రోగింది. డప్పు వాయిద్యాలతో గ్రామాల నుంచి ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకుని భక్తిపారవశ్యం చెందారు. ఆలయ పరిసరాలతో పాటుగా ప్రధాన రహదారులు భక్త జనసంద్రంగా మారాయి. జై వీరమ్మతల్లి.. జైజై వీరమ్మతల్లి అంటూ భక్తులు తమ భక్తిని చాటుకున్నారు. అమ్మవారి దర్శనానికి గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ఆలయం భక్తులతో నిండిపోవడంతో భక్తులు ధ్వజస్తంభం వద్దే మొక్కులు చెల్లించుకుని వెనుతిరిగారు. సీఐ హబీబ్‌బాషా, ఎస్సై గణేష్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం